న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్): దేశవ్యాప్తంగా ప్రముఖ ప్యాకేజ్డ్ తాగునీటి సంస్థ బిస్లెరీ నాణ్యతపై వివాదం చెలరేగింది. సంస్థకు చెందిన నీటి నమూనాలు నాణ్యతా పరీక్షల్లో విఫలమయ్యాయన్న అంశంపై భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) న్యాయపరమైన చర్యలకు అనుమతి మంజూరు చేసినట్లు వెల్లడైంది. దీంతో బిస్లెరీ నీటి భద్రతపై చర్చ మొదలైంది. అయితే ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వ్యవహారం కొత్తది కాదని, దాదాపు 14 నెలల క్రితం గోవాలోని తమ తయారీ కేంద్రంలో ఉత్పత్తి చేసిన ఒక బ్యాచ్‌కు సంబంధించినదని బిస్లెరీ ఇంటర్నేషనల్ స్పష్టం చేసింది. నీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని పేర్కొంది. బిస్లెరీ వెల్లడించిన వివరాల ప్రకారం.. 2025 సెప్టెంబర్ 30న ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు గోవాలోని తయారీ కేంద్రం నుంచి ఆరు నీటి నమూనాలను సేకరించారు. వాటిలో ఐదు నమూనాలు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని కంపెనీ తెలిపింది. ఆరో నమూనాలో మాత్రం ప్రాథమిక పరీక్ష సందర్భంగా బ్రోమేట్ పరిమాణం లీటరుకు 12 మైక్రోగ్రాములుగా నమోదైంది. అనుమతించిన పరిమితి లీటరుకు 10 మైక్రోగ్రాములు కాగా, రెండు మైక్రోగ్రాములు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ అంశమే వివాదానికి కారణమైందని సంస్థ వివరించింది. ప్రాథమిక పరీక్ష ఫలితాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ 2025 నవంబర్‌లో అప్పీలు చేసినట్లు బిస్లెరీ తెలిపింది. అనంతరం నమూనాను రిఫరల్ ప్రయోగశాలకు పంపగా, బ్రోమేట్ స్థాయి నిర్దేశిత పరిమితిలోనే ఉన్నట్లు తేలిందని పేర్కొంది. అయితే ఆ పరీక్షలో పాలీన్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్ల ఉనికిని గుర్తించినట్లు నివేదిక వెల్లడించిందని వివరించింది. రెండు ప్రయోగశాలల ఫలితాల్లో వైరుధ్యాలు ఉండటంతో అదే తేదీన తయారైన, అదే బ్యాచ్‌కు చెందిన నీటిని ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పొందిన స్వతంత్ర ప్రయోగశాలలో మరోసారి పరీక్షించామని తెలిపింది. ఆ పరీక్షల్లో నీరు అన్ని భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు తేలిందని కంపెనీ పేర్కొంది. మరోవైపు, రెండు వేర్వేరు ప్రయోగశాలల పరీక్షల్లో నమూనా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదన్న కారణంతో బిస్లెరీపై న్యాయస్థానంలో కేసు నమోదు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు నవంబర్ 22న ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించినట్లు సమాచారం. ఈ పరిణామంతో పాత వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. అయితే స్వతంత్ర ప్రయోగశాల నివేదిక తమ వాదనకు బలం చేకూరుస్తోందని బిస్లెరీ చెబుతోంది. వినియోగదారులకు సురక్షితమైన తాగునీటిని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని బిస్లెరీ ఇంటర్నేషనల్ స్పష్టం చేసింది. తయారీ ప్రక్రియ నుంచి సరఫరా వరకు నాణ్యతా ప్రమాణాలను కఠినంగా పాటిస్తున్నామని, ఈ వ్యవహారాన్ని నియంత్రణ సంస్థతో కలిసి చట్టపరమైన ప్రక్రియ ద్వారా పరిష్కరించుకుంటామని పేర్కొంది. కాగా, కేసు నమోదుకు అనుమతి ఇవ్వడం అంటే కంపెనీ తప్పు రుజువైనట్లు కాదని, తుది నిర్ణయం న్యాయపరమైన విచారణపై ఆధారపడి ఉంటుందని గమనించాలి. ప్రయోగశాలల నివేదికల్లో తేడాల నేపథ్యంలో ఈ వివాదం ఎలాంటి మలుపు తిరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

గోద్రా రైలు దహనం కేసు

17 ఏళ్ల తర్వాత వైద్య కారణాలతో దోషికి బెయిల్ మంజూరు

జీవిత ఖైదు అనుభవిస్తున్న ఇర్ఫాన్ సిరాజ్ పడాకు ఊరట

న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్): గోద్రా రైలు దహనం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్న ఇర్ఫాన్ సిరాజ్ పడాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తీవ్రమైన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో పాటు, ఇప్పటికే 17 ఏళ్లకు పైగా జైలులో గడిపిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని సర్వోన్నత న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. సోమవారం (నవంబర్ 23) జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలేతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇర్ఫాన్‌కు ఉన్న తీవ్రమైన గుండె సంబంధిత అనారోగ్య పరిస్థితిని గుజరాత్ ప్రభుత్వం కూడా వ్యతిరేకించకపోవడంతో, వైద్య కారణాలతో అతడి శిక్షను తాత్కాలికంగా నిలిపివేస్తూ బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం అంగీకరించింది. 2002 ఫిబ్రవరి 27న గుజరాత్‌లోని గోద్రా వద్ద సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలులోని ఎస్-6 బోగీలో మంటలు చెలరేగిన ఘటనలో అయోధ్య నుంచి తిరిగి వస్తున్న 58 మంది కరసేవకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అనంతరం గుజరాత్‌లో తీవ్ర మత ఘర్షణలు చెలరేగాయి. ఈ కేసును విచారించిన ప్రత్యేక న్యాయస్థానం 2011 మార్చిలో 31 మందిని దోషులుగా నిర్ధారిస్తూ.. వారిలో 11 మందికి మరణశిక్ష, మరో 20 మందికి జీవిత ఖైదు విధించింది. అయితే, 2017లో గుజరాత్ హైకోర్టు 11 మంది మరణశిక్షలను జీవిత ఖైదులుగా మారుస్తూ తీర్పునిచ్చింది. కాగా, ఈ కేసులో గతంలోనూ పలువురు దోషులకు సుప్రీంకోర్టు వివిధ కారణాలతో బెయిల్ మంజూరు చేసింది. 2022లో ఇద్దరికి, 2023 ఏప్రిల్‌లో మరో ఎనిమిది మంది దోషులకు బెయిల్ ఇవ్వగా, తాజాగా ఇర్ఫాన్ సిరాజ్ పడాకు వైద్య కారణాలతో బెయిల్ లభించింది.





ఆసియాలో మూడో మహాశక్తిగా భారత్!

రెండో అత్యంత సమర్థ నేతగా ప్రధాని మోదీ!

సిడ్నీ/న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్): ఆసియా పవర్ ఇండెక్స్-2025లో 'ప్రధాన శక్తి' హోదాకు భారత్ చేరుకుందని ఆస్ట్రేలియా సంస్థ లోవీ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. ఆసియాలోనే మూడో శక్తిమంతమైన దేశంగా భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నట్లు తెలిపింది. ఈ నివేదిక ప్రకారం, ప్రధాని నరేంద్ర మోదీ రెండో అతి శక్తిమంతమైన నేతగా రికార్డు సృష్టించారు. పెరిగిన ప్రాంతీయ రక్షణ భాగస్వామ్యం, ఆగ్నేయాసియా దేశాలకు బ్రహ్మోస్ క్షిపణుల విక్రయాలు దేశ రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేశాయని లోవీ ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది. అదే సమయంలో స్థిరమైన వాణిజ్య, పెట్టుబడి, ఆర్థిక సంబంధాలు భారత్‌ను మరింత ముందుకు నడిపించినట్లు విశ్లేషించింది. ఆసియా దేశాల శక్తి సామర్థ్యాలు, అంతర్జాతీయంగా చూపించే ప్రభావం ఆధారంగా వార్షిక ఆసియా పవర్ ఇండెక్స్‌ను నిర్ణయిస్తారు. ఆసియా పవర్ ఇండెక్స్-2025లో 40 పాయింట్ల స్కోరుతో ఉన్న భారత్, ఈ ఏడాదిలో మరో 0.5 పాయింట్లు మెరుగుపడి 40.5 పాయింట్లకు చేరింది. దీంతో 2018 తర్వాత చైనాతో భారత్‌కున్న అంతరం భారీగా తగ్గింది. 100 పాయింట్లకు గానూ అమెరికా 78.9 స్కోరుతో, చైనా 73.6 స్కోరుతో 2026 నాటికి ఆసియాలో అగ్రరాజ్యాలుగా కొనసాగుతున్నాయి. నాయకత్వ సామర్థ్యాల విషయానికొస్తే.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తర్వాత ఆసియాలో రెండో అత్యంత సమర్థమైన నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ నిలిచారు.

రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు

'జ్వాలా ఎంకే-1' కౌంటర్ డ్రోన్ మిసైల్ పరీక్ష విజయవంతం!

సైనిక స్థావరాలు, కీలక రక్షణ ప్రాంతాల భద్రతకు ఉపయోగకరం

జైపూర్, నవంబర్ 23 (సమయం న్యూస్): రక్షణ రంగంలో స్వావలంబన దిశగా భారత్ మరో కీలక ముందడుగు వేసింది. దేశీయంగా అభివృద్ధి చేసిన స్వయంప్రతిపత్తి కౌంటర్ డ్రోన్ సూక్ష్మ క్షిపణి వ్యవస్థ 'జ్వాలా ఎంకే-1'ను రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ రంగ సంస్థ ఐజీ డిఫెన్స్ వెల్లడించింది. ఆధునిక యుద్ధాల్లో శత్రు డ్రోన్ల నుంచి ఎదురవుతున్న ముప్పును సమర్థంగా ఎదుర్కొనే లక్ష్యంతో ఈ వ్యవస్థను రూపొందించినట్లు తెలిపింది. నిఘా, గూఢచర్యం, దాడుల కోసం వినియోగించే డ్రోన్లను గుర్తించి, వాటిని అడ్డుకునేలా అత్యాధునిక సాంకేతికతను ఇందులో పొందుపరిచినట్లు పేర్కొంది. ఐజీ డిఫెన్స్ వివరాల ప్రకారం.. జ్వాలా ఎంకే-1 వ్యవస్థ 2 నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వైమానిక లక్ష్యాలను ఎదుర్కోగలదు. భూమికి 50 మీటర్ల



నుంచి 5 వేల మీటర్ల ఎత్తులో ప్రయాణించే డ్రోన్లను ఛేదించే సామర్థ్యంతో దీనిని రూపొందించారు. ముఖ్యంగా చిన్నపాటి డ్రోన్లను గుర్తించి వాటి కదలికలను విశ్లేషించడం, అవసరమైన సమయంలో ప్రతిచర్యలు చేపట్టడం ఈ వ్యవస్థ ప్రత్యేకతగా సంస్థ పేర్కొంది. జ్వాలా ఎంకే-1లో 'గ్రిడ్' పేరుతో కృత్రిమ మేధ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. వివిధ సెన్సార్ల నుంచి సమాచారాన్ని సేకరించి శత్రు డ్రోన్లను గుర్తించడం, వాటి స్వభావాన్ని విశ్లేషించడం, లక్ష్యాన్ని ఎదుర్కొనే చర్యలను సమన్వయం చేయడం ఈ సాంకేతికత ప్రధాన విధి. మిషన్ నిర్వహణ నుంచి నిర్ణయ ప్రక్రియ వరకు పలు కార్యకలాపాలను సమన్వయం చేసేలా దీనిని అభివృద్ధి చేసినట్లు సంస్థ తెలిపింది. మరోవైపు జ్వాలా ఎంకే-1ను నాలుగు చక్రాల డ్రైవ్ కలిగిన వాహనంపై అమర్చిన బహుళ క్షిపణి ప్రయోగ వ్యవస్థ ద్వారా ప్రయోగించేలా రూపొందించారు. దీంతో అవసరాన్ని బట్టి సరిహద్దు ప్రాంతాలు, సైనిక స్థావరాలు, ఇతర కీలక రక్షణ కేంద్రాలకు వేగంగా తరలించి మోహరించే అవకాశం ఉంటుంది. స్థిరమైన రక్షణ వ్యవస్థలతోపాటు సంచార రక్షణ అవసరాలకు కూడా ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ల వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొనే దేశీయ సాంకేతికతకు ప్రాధాన్యం పెరిగింది. తక్కువ ఎత్తులో ప్రయాణించే చిన్న డ్రోన్లు సైతం కీలక సైనిక స్థావరాలకు ముప్పుగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జ్వాలా ఎంకే-1 వంటి కౌంటర్ డ్రోన్ వ్యవస్థలు రక్షణ రంగానికి ఉపయోగపడనున్నాయి. పోఖ్రాన్‌లో నిర్వహించిన పరీక్ష విజయవంతమైందని ఐజీ డిఫెన్స్ ప్రకటించడం దేశీయ రక్షణ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిలో మరో ముందడుగుగా నిలిచింది.

వార్షిక తనిఖీల్లో భాగంగా కొడంగల్ పోలీస్ స్టేషన్, సీఐ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ





కొడంగల్ మున్సిపల్,23(సమయం న్యూస్)

వార్షిక తనిఖీల్లో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్ర, IPS సోమవారం కొడంగల్ పోలీస్ స్టేషన్ మరియు కొడంగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పరిగి డిఎస్పీ శ్రీనివాస్ జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా కొడంగల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, రికార్డుల నిర్వహణ, వివిధ రిజిస్టర్లు, కేసు ఫైళ్లు, స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును, ఫిర్యాదుల స్వీకరణ, వాటిపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అనంతరం బ్లూ కోల్ట్స్ సిబ్బంది, స్టేషన్ రైటర్లు, CCTNS సిబ్బంది, కోర్టు డ్యూటీ సిబ్బంది తదితరులతో విడివిడిగా మాట్లాడి వారి విధులు, బాధ్యతలు, రోజువారీ పనితీరు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పురోగతి, కేసుల దర్యాప్తు, నిందితుల అరెస్టులు, కోర్టు కేసుల నిర్వహణ, సమన్లు మరియు వారెంట్ల అమలు, కేసుల పరిష్కారంలో తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా, సమయపాలనతో నిర్వహించాలని సూచించారు.ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగిస్తూ నేరస్తులకు శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేయాలని సూచించారు. అలాగే CCTNS వ్యవస్థలో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దిత గడువులోగా దర్యాప్తు పూర్తి చేయాలని తెలిపారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తమ పరిధిలోని ప్రాంతాల్లో గస్తీ నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.అనంతరం కొడంగల్ సీఐ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ కార్యాలయ పరిసరాలు,. సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల పరిష్కారం, సిబ్బంది విధుల పర్యవేక్షణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ ,సీఐ ,ఎస్సై పోలీస్ స్టేషన్ మరియు సీఐ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక నేత్ర వైద్య సేవలు





- **జీజీహెచ్ కుత్బుల్లాపూర్‌లో నూతన స్లిట్ ల్యాంప్ యంత్రం ప్రారంభం**

మల్కాజిగిరి, నవంబర్ 23: సమయం

కుత్బుల్లాపూర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) నేత్ర వైద్య విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక స్లిట్ ల్యాంప్ బయోమైక్రోస్కోప్ యంత్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నేత్ర వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, రోగులకు మెరుగైన వైద్య పరీక్షలు, ఖచ్చితమైన రోగ నిర్ధారణ అందించాలనే లక్ష్యంతో ఈ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ ఆధునిక యంత్రం ద్వారా కంటి ముందు భాగాన్ని అత్యంత స్పష్టంగా, సూక్ష్మంగా పరీక్షించే అవకాశం ఉంటుంది. కంటిశుక్లం, కార్నియా సంబంధిత సమస్యలు, ఇతర నేత్ర వ్యాధులను గుర్తించడంతో పాటు, కంటిలో పడిన విదేశీ పదార్థాలను గుర్తించడం, వాటిని తొలగించేందుకు అవసరమైన పరీక్షలు నిర్వహించడం, కంటిశుక్లం తీవ్రతను అంచనా వేయడంలో ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుంది.నూతన యంత్రం అందుబాటులోకి రావడంతో నేత్ర వైద్య విభాగంలో రోగ నిర్ధారణ మరింత ఖచ్చితత్వంతో నిర్వహించేందుకు వీలుకానుంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఆధునిక నేత్ర వైద్య పరీక్షలు అందుబాటులోకి రావడం ప్రయోజనకరమని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ సాయి శోభ, నేత్ర వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బేగ్, పీఆర్ఓ డాక్టర్ పి. వినోద్, డాక్టర్లు రూప, కిరణ్, హరిత, రవీందర్ బాబు, అలేఖ్య, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ యవ్వన్, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్లు రోజ్‌లైన్, ఫాతిమా, ఆఫీస్ సూపరింటెండెంట్లు వినయ్ గాబ్రియేల్, నాయక్ పాల్గొన్నారు.

కేటీఆర్ దమ్ముంటే వరంగల్ పశ్చిమలో పోటీ చెయ్

- **బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అప్పులపాలు.. అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేశారు**
- **కాళోజీ కళాక్షేత్రం నుంచి విమానాశ్రయం వరకు గత ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో ఎండగట్టిన 'నాయిని'**
- **వరంగల్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం.. హనుమకొండ చౌరస్తాకు రా... ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

హనుమకొండ, నవంబర్ 23 (సమయం న్యూస్)



బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారని, అభివృద్ధి పేరుతో ప్రజలను మభ్యపెట్టి ప్రాజెక్టులన్నీ శిలాఫలకాలకే పరిమితం చేశారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పనులపై పూర్తి ఆధారాలు, జీవోలు, నిధుల వివరాలతో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అభివృద్ధిపై నమ్మకం ఉంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేయాలని అన్నారు. సోమవారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో నాయిని గత ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు.కేసీఆర్ వంద అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేశారని, ప్రజలు వంద సార్లు ముక్కు నేలకు రాసినా ఆయనను క్షమించే పరిస్థితిలో లేరని నాయిని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన కొబ్బరికాయలు కొట్టడం, శిలాఫలకాలు వేయడానికే పరిమితమైందని, నిజంగా అభివృద్ధి చేసి ఉంటే ప్రజలు ఆ పార్టీని ఎందుకు ఓడించారని ప్రశ్నించారు. గత పాలకులు అసంపూర్తిగా వదిలేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా పూర్తి చేస్తోందని తెలిపారు.కాళోజీ కళాక్షేత్రం గత ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. సుమారు రూ.20 కోట్లతో పిల్లర్లు, స్లాబ్ పనులు చేపట్టి నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారని, భవన నిర్మాణ నాణ్యతపై ఎన్ఐటీ నిపుణులతో పరిశీలన చేయించాల్సి వచ్చిందని తెలిపారు. భవన పటిష్టత కోసం మరో రూ.10 కోట్లు కేటాయించినా నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీనిపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోందన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కుడా, పర్యాటక శాఖల సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లి సుమారు రూ.80 కోట్ల నిధులు సమకూర్చినట్లు వివరించారు.రింగ్ రోడ్డు పేరుతో గత ప్రభుత్వం హడావుడి చేసి శంకుస్థాపనలు చేసినా, ప్రాజెక్టుకు సంబంధించిన జీవోనే రద్దయిందని విమర్శించారు. వరంగల్ విమానాశ్రయానికి గతంలో 696 ఎకరాల 14 గుంటల భూమి మాత్రమే ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం మరో 253 ఎకరాలను సేకరించిందని, ఇందుకోసం రూ.205 కోట్లకు పైగా ఖర్చు చేసిందని వెల్లడించారు.నగర తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.550 కోట్లతో వాటర్ వర్క్స్ ఆధునీకరణ చేపట్టి, నాలుగు అంగుళాల పైపుల స్థానంలో ఎనిమిది అంగుళాల పైపులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. యూనివర్సిటీ పరిసరాల్లోనూ పైపులైన్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పాలిటెక్నిక్, ఐటీఐ, మడవీధుల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్‌ను సక్రమంగా అమలు చేయలేని గత పాలకులు ఫ్యూచర్ సిటీ గురించి మాట్లాడటం హాస్యాస్పదమని నాయిని ఎద్దేవా చేశారు. గతంలో ప్రారంభించిన ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేసి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేయడం బీఆర్ఎస్ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. వరంగల్ పశ్చిమలో తాను చేపట్టిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు రావాలని, హనుమకొండ చౌరస్తాలో ప్రజల సమక్షంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ఆధారాలతో వివరిస్తానని సవాల్ విసిరారు.ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందించలేకపోయారని విమర్శించారు. నిరుపయోగంగా, శిథిలావస్థకు చేరిన ఇళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేపట్టి లబ్ధిదారులకు అందజేస్తోందన్నారు. విద్యావ్యవస్థపై గత ప్రభుత్వం సరైన సమీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేసిందని, మహిళల సమస్యలను పరిష్కరించలేని బీఆర్ఎస్ నేతలు వాటిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణను సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన కేసీఆర్, మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి అదే పరిస్థితి ఎదురవుతుందని విమర్శించారు.వరంగల్ విమానాశ్రయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో కీలక ముందడుగు వేసిందని, టెండర్ల ప్రక్రియ పూర్తయిందని కడియం కావ్య తెలిపారు. హనుమకొండలో ఐటీ టవర్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని, స్థల పరిశీలన చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారని వెల్లడించారు. కాళోజీ కళాక్షేత్రం రెండో అంతస్తులను కమర్షియల్ కాంప్లెక్స్‌కు అద్దెకు ఇచ్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే జీవోలు జారీ చేసిందని గుర్తుచేశారు. అప్పుల తెలంగాణను అభివృద్ధి బాటలోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.సమావేశంలో కుడా వైస్ చైర్మన్ గుండు సుధారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొడ్డిడి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సంగ వెంకట్రాజం, హనుమకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి ప్రియాంక, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకి కార్పొరేషన్‌తో సామాజిక అభ్యున్నతికి కొత్త ఆశలు

- **వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్పకు ఘన సన్మానం**

హైదరాబాద్, నవంబర్ 23

వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్పను సీనియర్ జర్నలిస్టు మన్నె సురేష్, ఆర్కే ప్రింటర్స్ ఎండీ రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేషన్ ఏర్పాటు అయిన సందర్భంగా చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గట్టు తిమ్మప్పను శాలువాతో సత్కరించి, వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని అందజేశారు. వాల్మీకి బోయ సామాజిక వర్గ అభివృద్ధి, సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడు బోయ రాములు, పలువురు వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.



పనిముట్ల కొరతతో మున్సిపల్ కార్మికుల ఇబ్బందులు

- **పాడైపోయిన ట్రైసైకిళ్లతోనే విధులు.. చీపురు కట్టలు పెంచాలని సీఐటీయూ డిమాండ్**

మల్కాజిగిరి, సమయం:

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మౌలాలి సర్కిల్‌లో పారిశుద్ధ్య కార్మికులకు కనీస పని సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రోజూ సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్లను శుభ్రం చేయాల్సి వస్తున్నా, ఐదు నెలలకు కేవలం ఐదు చీపురు కట్టలు మాత్రమే అందించడం ఏమాత్రం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు.నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన పనిముట్లు సరిపడా అందించకపోవడం మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రోజువారీ విధుల నిర్వహణకు అనుగుణంగా చీపురు కట్టలను తగిన సంఖ్యలో సరఫరా చేయాలని కోరారు.మరోవైపు కార్మికులకు కేటాయించిన ట్రైసైకిళ్లు పాడైపోయి, తుప్పుపట్టిన స్థితిలో ఉన్నాయని, వాటితోనే విధులు నిర్వహించాల్సి రావడం ఇబ్బందికరంగా మారిందన్నారు. దెబ్బతిన్న ట్రైసైకిళ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని, మరమ్మతులకు పనికిరాని వాటి స్థానంలో కొత్త ట్రైసైకిళ్లను అందించాలని డిమాండ్ చేశారు.మౌలాలి సర్కిల్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నాణ్యమైన పనిముట్లు, అవసరమైన సౌకర్యాలు కల్పించి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఎన్. శ్రీనివాస్ కోరారు.



ఓం శ్రీ సాయిరాం భగవాన్ శ్రీ సత్య సాయిబాబా 101వ జన్మదినం

- **సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు**

కొడంగల్ మున్సిపల్, నవంబర్,23(సమయం న్యూస్)

ఓం శ్రీ సాయిరాం భగవాన్ శ్రీ సత్య సాయిబాబా వారి 101వ జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీ సత్య సాయి భజన మండలి కొడంగల్ తాండూరు సమితి వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో కొడంగల్ పట్టణ కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరము నిర్వహించడం జరిగినది.OP 87 మంది ని పరీక్షించగా కంటి శుక్లాలు ఉన్నాయి అని 37 నిర్ధారించి ఆపరేషన్ చేయించడానికి 37 మంది ఆపరేషన్ చేయించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ రవీంద్ర యాదవ్,డాక్టర్ సాకేత్,శ్రీనివాస్ యాదవ్,దశరథ్, భీమారాజ్,మూరహరి వశిష్ఠ, మరియు సాయి బంధువులందరూ,సాయి సేవ దళ్, పాల్గొనడం జరిగింది.



ప్రతి కుటుంబానికి ఒక భరోసా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

చేవెళ్ల సమయం న్యూస్

షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడ గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పోస్టర్ రిలీజ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుత్తి చేన్నయ్య, గ్రామ కార్యదర్శి స్వప్న, వార్డు సభ్యులు గుత్తి శ్రీహరి, నీరటి రాజశేఖర్ పాల్గొని పోస్టర్ ను ఆవిష్కరించారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి ఈ పథకం ద్వారా ఒక భరోసా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. బీమా చేయించుకున్న లబ్ధిదారులు, గ్రామస్తులు మద్దూరి హరీష్, టిల్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా వర్తింపజేయాలి!

చేవెళ్ల సమయం న్యూస్



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని రేషన్ కార్డులో పేర్లు ఉన్న కుటుంబ సభ్యులందరికీ వర్తింపజేయాలని ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు చొక్కంపేట ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కుటుంబంలో కేవలం ఒక్కరికే బీమా వర్తింపజేయడం సరైన విధానం కాదని, తండ్రి, తల్లి, భార్య, భర్త, కుమారుడు, కుమార్తె ప్రతి ఒక్కరి ప్రాణం విలువైనదేనని అన్నారు. మరణం సంపాదించే వ్యక్తికే వస్తుందా? ఇతర సభ్యులకు ప్రమాదాలు రావా? అని ప్రశ్నించారు.ప్రతి అర్హత కలిగిన సభ్యుడికి బీమా కల్పించడంతో పాటు, క్లెయిమ్ ప్రక్రియను సరళీకరించి నిర్ణీత గడువులో బీమా సొమ్ము అందేలా చూడాలని కోరారు.

ప్రజావాణి ఆర్జీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- రాష్ట్రస్థాయిలోనూ ప్రజావాణి దరఖాస్తుల పర్యవేక్షణ.
- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

నారాయణపేట, నవంబర్,23(సమయం న్యూస్)

ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను రాష్ట్ర స్థాయిలోనూ పర్యవేక్షణ చేస్తున్నారని, సంబంధిత అధికారులు వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అన్నారు. సోమవారం మండల్ ప్రజావాణి సందర్భంగా మక్తల్ ఎంపిడిఓ లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించకపోవడంతో చాలామంది ప్రజలు అవే సమస్యలపై తిరిగి వస్తున్నారన్నారు. ఆయా ఆర్జీలను తిరస్కరించాల్సి ఉంటే అందుకు గల కారణాలను నిబంధనల ప్రకారం తెలియజేయాలని, ఆర్జీదారులకు ఏ విషయం చెప్పకుండా దరఖాస్తులను అలాగే వద్ద ఉంచుకోవడం సరి కాదన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు....



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

వికారాబాద్, నవంబర్,23(సమయం న్యూస్)

వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు .ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను,ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, వాటిపై తక్షణమే స్పందించాలని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS మాట్లాడుతూ "ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపించడమే ప్రజావాణి కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రజలు ఇప్పుడైనా పోలీస్ శాఖను ఆశ్రయించవచ్చని, ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా పోలీస్ శాఖను సంప్రదించవచ్చు" అని తెలిపారు.



తాండూరులో ఘనంగా అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమం


తాండూరు మున్సిపల్, నవంబర్,23(సమయం న్యూస్)

తాండూరులో అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమాన్ని జంగం కిరణ్ కుమార్ నిర్వహించారు.ఈ పవిత్ర కార్యక్రమంలో డాక్టర్ సంపత్ కుమార్ వారి బృందంతో కలిసి పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు .ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, "అయ్యప్ప స్వాముల దీక్ష అంటేనే క్రమశిక్షణ, భక్తి, త్యాగానికి ప్రతీక. అయ్యప్ప స్వామి ఆశీస్సులు తాండూరు ప్రజలపై, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కిరణ్ కుమార్ వారి కుటుంబంపై ఎల్లవేళలా అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని తెలియజేశారు.అయ్యప్ప స్వాములకు, భక్తులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.కిరణ్ కుమార్ చేసిన ఈ పూజా కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, స్వామి వారి ఆశీస్సులు పొందారు.



ఐదేళ్లుగా వెంటాడుతున్న డ్రైనేజీ సమస్య





- మౌలాలి డివిజన్‌లో పలుచోట్ల పూడుకుపోతున్న మ్యాన్‌హోళ్లు.. మురుగునీటి ప్రవాహానికి తరచూ అంతరాయం
- అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం

మల్కాజిగిరి, సమయం:

మౌలాలి డివిజన్ పరిధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్య స్థానికులను ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. హనుమాన్ నగర్, ఆర్టీసీ కాలనీ, నానా హిల్స్ కాలనీ, పీవీఎన్‌ఆర్ కాలనీలతో పాటు పలు ప్రాంతాల్లో ప్రధాన మ్యాన్‌హోళ్లు పూడుకుపోతుండటంతో మురుగునీటి ప్రవాహం తరచూ నిలిచిపోతోంది. దీంతో స్థానికులు దుర్వాసన, మురుగునీటి సమస్యలతో సతమతమవుతున్నారు.ప్రధాన మ్యాన్‌హోళ్ల లోపలి గోడలకు సక్రమంగా సిమెంట్ ప్లాస్టరింగ్ లేకపోవడంతో మట్టి, సిల్ట్ పేరుకుపోయి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి కొన్ని వారాలకోసారి మ్యాన్‌హోళ్లు పూడుకుపోవడం, మురుగునీరు ముందుకు వెళ్లకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సీనియర్ జర్నలిస్ట్ మహమ్మద్ లియాఖత్ అలీ సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. మరమ్మతులకు నిధుల కొరత ఉందంటూ అధికారులు చెబుతున్నారని, ఐదేళ్లుగా సమస్యను పరిష్కరించకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, జలమండలి ఉన్నతాధికారులు, జీఎం సునీల్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రధాన మ్యాన్‌హోళ్లను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు నాణ్యమైన ప్లాస్టరింగ్ పనులు పూర్తి చేయాలని, సిల్ట్ పేరుకుపోకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కొడంగల్ లో డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ రిటైర్డ్ ఐపీఎస్ జన్మదిన వేడుకలు

కొడంగల్ మున్సిపల్, నవంబర్,23(సమయం న్యూస్)



వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ రిటైర్డ్ ఐపీఎస్ 60వ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞా దివస్ ఉత్సవాల్లో భాగంగా స్వేరోస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది... ఈ కార్యక్రమం స్వేరోస్ నెట్‌వర్క్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ముకుంద్ స్వేరో ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రం పల్లి శ్రీనివాస్, కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షులు కుప్పగిరి సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు మహిపాల్ స్వేరో ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది... ఈ వేడుకల్లో బహుజన నాయకులు, స్వేరో అనుబంధ సంఘాల నాయకులు, స్వేరోస్ కార్యకర్తలు, ఆర్ఎస్పీ అభిమానులు, బహుజన నాయకులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అక్షరం, ఆర్థికం, ఆరోగ్యం అనే మూడు ప్రధాన ఆశయాల ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యా చైతన్యం, ఆర్థిక స్వావలంబన, ఆరోగ్య అవగాహనతో సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు...అనంతరం కేక్ కట్ చేసి డాక్టర్ ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్ 60వ జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు...!!ఈ కార్యక్రమంలో: స్వేరోస్ నెట్‌వర్క్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ముకుంద్ స్వేరో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్ కొడంగల్ నియోజకవర్గ స్వేరోస్ అధ్యక్షులు కుప్పగిరి సాయిలు జిల్లా ఉపాధ్యక్షులు మహిపాల్ స్వేరో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు చెవిటి శ్రీనివాస్,బి ఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగే శ్రీనివాస్, దుద్యాల బిఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షులు లగచర్ల సురేష్, రుద్రారం శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ వరప్రసాద్, అన్నారం సాయిలు,సునీల్ శ్రీనివాస్ అనిల్ విజయ్ కుమార్ సాబప్ప మల్లేష్ అభిషేక్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యములో సాయిగూడెం, మందనపల్లిలో ఉచిత వైద్య శిబిరాలు

- ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ.. అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలు

ఆలేరు, నవంబరు 23(సమయం న్యూస్):



రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మెడిసిటీ ఆసుపత్రి సహకారంతో సాయిగూడెం, మందనపల్లి గ్రామాల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాల్లో వైద్యులు గ్రామస్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయిగూడెం గ్రామంలో రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు గాదపాక సునీత, మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి గ్రామ సర్పంచ్ గ్యార కవిత సంపత్, ఉపసర్పంచ్ భయ్యా జ్ఞానేందర్, వార్డు సభ్యులు, పాలకవర్గం సహకరించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకుడు భీమగాని వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. వార్డు సభ్యులు భీమగాని ప్రియాంక, రాజు, గజ్జల శేఖర్, ముద్దేపాక సుశీలమ్మతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అదేవిధంగా మందనపల్లి గ్రామంలో సర్పంచ్ సిరిమతి రేణుక నరసయ్య, ఉపసర్పంచ్ పద్మశ్రీ శశిరేఖ సుదర్శన్, పాలకవర్గ సభ్యుల సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు గాదపాక మల్లేష్, కొల్లూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డు సభ్యులు కడకంచి శ్రీలత కృష్ణ, తమ్ముడి అంజయ్య రాము, కడకంచి సిద్ధిరాజు, ఉట్కూరి అంజయ్య, పంచాయతీ కార్యదర్శి సర్వర్ నాయక్, గ్రామస్థాయి ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

రైతులే నాణ్యమైన విత్తనోత్పత్తిదారులుగా ఎదగాలి

- కొలనుపాకలో వరిలో నాణ్యమైన విత్తనోత్పత్తిపై క్షేత్ర దినోత్సవం

ఆలేరు, నవంబరు 23(సమయం న్యూస్):



రైతులకు నాణ్యమైన వరి విత్తనాలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, రైతులే విత్తనోత్పత్తిదారులుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలనే లక్ష్యంతో కొలనుపాక గ్రామంలో క్షేత్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నాబార్డు ప్రాజెక్టు-2026లో భాగంగా రైతు ఆరుట్ల విజేందర్ రెడ్డి పొలంలో ఈ కార్యక్రమం జరిగింది. వరిలో నాణ్యమైన విత్తనోత్పత్తి అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. నాబార్డు ప్రాజెక్టులో భాగంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సహకారంతో కొలనుపాక గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు కేఎన్ఎం 1638 వరి రకానికి చెందిన విత్తనాలను విత్తనోత్పత్తి కోసం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, సమన్వయకర్త డాక్టర్ డి.శ్రీలత మాట్లాడుతూ నాబార్డు ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశాలను వివరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను స్వయంగా ఉత్పత్తి చేసుకునేలా ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయంలో స్వావలంబన సాధించవచ్చన్నారు. భువనగిరి జిల్లా సహకార అధికారి నాగార్జున మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతుల నుంచి నాణ్యమైన విత్తనాలను సేకరించి, శుద్ధి చేసి, తిరిగి ఇతర రైతులకు విత్తనాలుగా అందుబాటులోకి తీసుకురావచ్చని తెలిపారు. దీనివల్ల ప్రైవేటు విత్తన వ్యాపారులపై రైతుల ఆధారపడటం తగ్గుతుందన్నారు. రైతులే విత్తనాలను ఉత్పత్తి చేయడంతో పాటు ఇతర రైతులకు సరఫరా చేసే అవకాశం ఉంటుందని వివరించారు. నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి ఝాన్సీరాణి మాట్లాడుతూ నాబార్డు అమలు చేస్తున్న వివిధ పథకాలు, వాటి లక్ష్యాలు, రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి నాబార్డు అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆలేరు వ్యవసాయ సహాయ సంచాలకురాలు నిర్మల మాట్లాడుతూ రైతులు స్వయంగా నాణ్యమైన విత్తనోత్పత్తి చేపట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విత్తనోత్పత్తి సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, సాగు పద్ధతులు, సాంకేతిక మెళకువలతో పాటు దీనివల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ విత్తనోత్పత్తి చేపట్టే రైతులకు వ్యవసాయ శాఖ అందించే సహకారం, సాంకేతిక సూచనలను వివరించారు. విత్తనోత్పత్తి చేపడుతున్న రైతులు బెధరబోయిన శంకరయ్య, ఆరుట్ల విజేందర్ రెడ్డి తమ అనుభవాలను పంచుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందిస్తున్న సాంకేతిక సలహాలు, సహకారం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం రైతులతో ముఖాముఖి చర్చ నిర్వహించి, వరిలో నాణ్యమైన విత్తనోత్పత్తికి సంబంధించిన సందేహాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకటరెడ్డి, సంఘం సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్, రైతులు, సహకార సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



భారత్ చేతిలో థాయ్‌లాండ్ చిత్తు

భోపాల్: మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్లో భారత్ విజయాల హ్యాట్రిక్ కొట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 7-0తో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసింది. దీపిక హ్యాట్రిక్‌తో జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించింది. నాలుగో నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్‌ను నవ్‌నీత్ కౌర్ గోల్‌గా మలిచి భారత్‌ను ఆధిక్యంలో నిలిపింది. ఆపై దీపిక (10, 11వ నిమిషాలు) స్వల్ప వ్యవధిలో రెండుసార్లు బంతిని లక్ష్యానికి చేర్చడంతో స్కోరు 3-0గా మారింది. తర్వాత భారత్ జోరు మరింత పెరిగింది. మరో మూడు గోల్స్ ఖాతాలో చేరాయి. ఈ గోల్స్‌ను ముంతాజ్ ఖాన్ (28వ), సునెలితా టోపో (32వ), దీపిక (56వ) చేశారు. 56వ నిమిషంలోనే నవ్‌నీత్ కౌర్ పెనాల్టీ స్ట్రోక్‌ను సద్వినియోగం చేయడంతో భారత్ 7-0తో నిలిచింది. ఆ తర్వాత థాయ్‌లాండ్‌ను ఒక్క గోల్ కూడా కొట్టనీయకుండా మ్యాచ్‌ను ముగించింది. ఈ టోర్నీలో ఇప్పటికే మలేసియా, దక్షిణ కొరియాపై భారత్ గెలిచింది.



భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లో ఉద్రిక్తత

హర్షిత్ రాణాపై స్లెడ్జింగ్..

పాక్ ఆటగాళ్లతో తిలక్ వర్మ వాగ్వాదం!

దోహా, నవంబర్ 23 (సమయం న్యూస్): రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ వివాదానికి దారితీసింది. భారత బౌలర్ హర్షిత్ రాణాను పాకిస్థాన్ ఆటగాళ్లు కవ్వించడంతో మైదానంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సహచర ఆటగాడి పట్ల ప్రత్యర్థుల ప్రవర్తనపై భారత కెప్టెన్ తిలక్ వర్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా అంపైర్లు జోక్యం చేసుకుని ఆటగాళ్లను శాంతింపజేశారు. భారత ఇన్నింగ్స్ 45వ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. మహమ్మద్ ఇమ్రాన్ రంధావా వేసిన రెండో బంతికి హర్షిత్ రాణా ఔటయ్యాడు. అప్పటికే భారత్ ఓటమి అంచున ఉండగా, పాకిస్థాన్ విజయానికి మరో వికెట్ మాత్రమే అవసరమైంది. హర్షిత్ పెవిలియన్‌కు వెళ్తున్న సమయంలో సూఫియాన్ ముకీమ్‌తోపాటు పలువురు పాక్ ఆటగాళ్లు అతడిని కవ్వించినట్లు కనిపించింది. దీంతో మరో ఎండ్‌లో ఉన్న తిలక్ వర్మ వెంటనే స్పందించి ప్రత్యర్థి ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగాడు. అంపైర్లు మధ్యలోకి వచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అయితే ఈ వివాదానికి ముందు కూడా ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య మాటల యుద్ధం జరిగినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ బ్యాటింగ్ సమయంలో హర్షిత్ రాణా పలుమార్లు ప్రత్యర్థి ఆటగాళ్లను కవ్వించినట్లు సమాచారం. వికెట్లు తీసిన సందర్భాల్లోనూ వాగ్వాదం జరగడంతో అంపైర్లు జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హర్షిత్ ఔటైన తర్వాత పాక్ ఆటగాళ్లు అదే తరహాలో స్పందించినట్లు కనిపిస్తోంది. అయితే ఆటగాళ్లు అసభ్య పదజాలం ఉపయోగించారనే అంశంపై స్పష్టత లేదు. ఈ ఘటనపై మ్యాచ్ రిఫరీ ఏమైనా చర్యలు తీసుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది. ఇక మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ ఏ జట్టు 49.2 ఓవర్లలో 313 పరుగులకు ఆలౌటైంది. హసన్ నవాజ్ 79, మాజ్ సదాఖత్ 59, ఫర్హాన్ యూసఫ్ 56 పరుగులతో రాణించారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, సూర్యాన్ష్ షెడ్గే, విప్రజ్ నిగమ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. 314 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 49.1 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. తిలక్ వర్మ సెంచరీతో పోరాడగా, అభిషేక్ శర్మ 70, షాబాజ్ అహ్మద్ 56 పరుగులు సాధించారు. అయినప్పటికీ భారత్‌కు ఓటమి తప్పలేదు. పాకిస్థాన్ ఏ జట్టు 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ ఫలితం కంటే మైదానంలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య జరిగిన



భారత్ టెస్టు డ్రా!

వెల్లింగ్టన్ తొలి టెస్టులో న్యూజిలాండ్ పోరాటపటిమ

720 పరుగులు చేసినా గెలుపు దక్కలేదు..

- రెండో ఇన్నింగ్స్‌లో 239/5తో ఓటమిని తప్పించుకున్న కివీస్
- ఎనిమిది మంది బౌలర్లను ప్రయోగించిన టీమిండియా
- భారత బౌలర్ల ఖాతాలో 42 మెయిడిన్ ఓవర్లు
- 43 ఓవర్లపాటు క్రీజులో పాతుకుపోయిన మిచెల్, ఫిలిప్స్



వెల్లింగ్టన్, నవంబర్ 23 (సమయం న్యూస్): న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో భారీ స్కోరు సాధించినప్పటికీ భారత్‌కు విజయం దక్కలేదు. వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 368 పరుగులు చేయగా, భారత్ 720/9 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దీంతో 352 పరుగుల ఆధిక్యం సాధించిన టీమిండియా విజయంపై ఆశలు పెట్టుకుంది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ బ్యాటర్లు పట్టుదలగా ఆడి 239/5 స్కోరుతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించినప్పటికీ చివరి వరకు వికెట్లు పడగొట్టలేకపోయారు. ఈ మ్యాచ్‌లో భారత్ ఏకంగా ఎనిమిది మంది బౌలర్లను ఉపయోగించడం విశేషం. టెస్టు క్రికెట్ చరిత్రలో టీమిండియా ఒక ఇన్నింగ్స్‌లో ఎనిమిది మంది బౌలర్లను ప్రయోగించడం ఇది 28వసారి. గత ఆగస్టులో కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో జరిగిన టెస్టులోనూ భారత్ ఎనిమిది మంది బౌలర్లతో బౌలింగ్ చేయించింది. వరుసగా రెండు టెస్టుల్లో ఈ విధంగా బౌలర్లను ఉపయోగించడం భారత క్రికెట్ చరిత్రలో అరుదైన సందర్భంగా నిలిచింది. గతంలో 1963-64 ఇంగ్లండ్ సిరీస్‌తోపాటు 1952--53లో పాకిస్థాన్, వెస్టిండీస్‌లతో జరిగిన వరుస టెస్టుల్లో ఇలాంటి పరిస్థితి నమోదైంది. మరోవైపు భారత బౌలర్లు న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 42 మెయిడిన్ ఓవర్లు వేసి ప్రత్యేక గుర్తింపు సాధించారు. 2025-27 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చక్రంలో ఒక జట్టు ఇన్నింగ్స్‌లో నమోదైన అత్యధిక మెయిడిన్ ఓవర్లుగా ఇవి నిలిచాయి. చివరిసారిగా భారత్ ఒక ఇన్నింగ్స్‌లో 40కిపైగా మెయిడిన్ ఓవర్లు వేసింది 2015లో దక్షిణాఫ్రికాతో ఢిల్లీలో జరిగిన టెస్టులోనే. ఆ మ్యాచ్‌లో భారత బౌలర్లు ఏకంగా 89 మెయిడిన్ ఓవర్లు వేసి ప్రత్యర్థిని కట్టడి చేశారు. న్యూజిలాండ్ బ్యాటర్లు డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ భారత విజయావకాశాలను దెబ్బతీశారు. ఆరో వికెట్‌కు వీరిద్దరూ 43 ఓవర్లపాటు క్రీజులో నిలిచి భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. ఈ శతాబ్దంలో న్యూజిలాండ్ తరఫున ఆరో వికెట్ లేదా అంతకంటే దిగువ వికెట్‌కు నమోదైన సుదీర్ఘ భాగస్వామ్యాల్లో ఇది రెండో స్థానంలో నిలిచింది. 2014లో ఇదే మైదానంలో భారత్‌పై బ్రెండన్ మెకల్లమ్, బీజే వాట్లింగ్ 123 ఓవర్లపాటు బ్యాటింగ్ చేసి 352 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన రికార్డు ఇప్పటికీ అగ్రస్థానంలో ఉంది. ఇక నవంబర్ నెలలో నాలుగు టెస్టులు డ్రాగా ముగియడం మరో విశేషం. బంగ్లాదేశ్--వెస్టిండీస్, ఆఫ్ఘనిస్థాన్--జింబాబ్వే, పాకిస్థాన్--శ్రీలంక జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లతోపాటు భారత్--న్యూజిలాండ్ తొలి టెస్టు కూడా డ్రాగా ముగిసింది. 2011 తర్వాత ఒకే నెలలో నాలుగు టెస్టులు డ్రాగా ముగియడం ఇది మూడోసారి. గతంలో 2013 మార్చి, 2022 మార్చి నెలల్లో ఇలాంటి ఫలితాలు నమోదయ్యాయి. భారీ ఆధిక్యం సాధించినా ప్రత్యర్థి బ్యాటర్ల పట్టుదల ముందు భారత్ విజయం అందుకోలేకపోవడం ఈ మ్యాచ్‌లో ప్రధాన విశేషంగా నిలిచింది.

మా బ్యాటర్లు అద్భుతం



ఓడిపోయే మ్యాచ్‌ను డ్రా చేశారు

హెన్రీ నికోల్స్ ఆనందం!

వెల్లింగ్టన్, నవంబర్ 23 (సమయం న్యూస్): భారత్‌తో వెల్లింగ్టన్ వేదికగా జరిగిన తొలి టెస్టులో న్యూజిలాండ్ అద్భుతంగా పోరాడి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో అజేయంగా 175 పరుగులు చేసిన హెన్రీ నికోల్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. మ్యాచ్ అనంతరం మాట్లాడిన నికోల్స్.. ఐదు రోజుల ఆటను వెనక్కి తిరిగి చూసుకుంటే పిచ్ పరిస్థితులు మారుతూ వచ్చాయని, రెండు జట్లు తమ శక్తిమేరకు పోరాడాయని తెలిపారు. ముఖ్యంగా చివరి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై తమ బ్యాటర్లు చూపిన పట్టుదల ప్రశంసనీయమని పేర్కొన్నారు. డారిల్ మిచెల్ (49: 186 బంతుల్లో), గ్లెన్ ఫిలిప్స్ (26: 126 బంతుల్లో) 43 ఓవర్ల పాటు క్రీజ్‌లో పాతుకుపోవడంతో టీమిండియాకు విజయం దక్కలేదని గుర్తు చేశారు. తొలి ఇన్నింగ్స్ నుంచి మ్యాచ్ ముగిసే సమయానికి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, పిచ్‌లో మార్పులు వచ్చినప్పటికీ బ్యాటర్లకు కొన్ని సవాళ్లు ఎదురయ్యాయని నికోల్స్ వివరించారు. అలాంటి పరిస్థితుల్లోనూ వాటిని అధిగమిస్తూ ఆడటం జట్టుకు సంతృప్తినిచ్చిందని, ఒక దశలో కష్టాల్లో ఉన్న జట్టు చివరకు మ్యాచ్‌ను డ్రాగా ముగించుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ అద్భుతంగా ఆడి భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారని, ఆ ఇద్దరి వల్లే మ్యాచ్‌ను డ్రాగా ముగించుకోగలిగామని, జట్టులోని ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించారని నికోల్స్ పేర్కొన్నారు.

మరికొంత సేపు ఆడితే బాగుండేది..

క్రెస్ట్‌చర్చ్ పోరుపై ఆసక్తి:

టెస్టులో తొలి నాలుగు రోజుల పాటు ఎక్కువ సమయం మైదానంలోనే గడిపిన నికోల్స్‌ను శారీరక పరిస్థితి గురించి ప్రశ్నించగా.. తాను బాగానే ఉన్నానని చెప్పారు. ఐదు రోజుల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం వల్ల ఆటగాళ్లంతా అలసిపోయారని, చివరి రోజు మైదానంలోకి దిగకుండా ఉండటం తనకు కొంత వింతగా అనిపించిందని తెలిపారు. శరీరం నొప్పులతో ఉన్నప్పటికీ మరికొంత సేపు మైదానంలో ఉండి ఆడితే బాగుండేదని, ఈ మ్యాచ్ నిజంగా ఓపికకు పరీక్షగా నిలిచిందని పేర్కొన్నారు. బేసిన్ రిజర్వ్ మైదానంలో తనకు మంచి రికార్డు ఉందని, ఈ మైదానంపై తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, గతంలో మంచి ప్రదర్శనలు చేసిన మైదానానికి తిరిగి రావడం ఎప్పుడూ సంతోషాన్నిస్తుందని హెన్రీ నికోల్స్ అన్నారు. తొలి రోజు పిచ్ గతంలో మాదిరిగానే ఉంటుందని భావించామని, అయితే ఆట సాగుతున్న కొద్దీ పరిస్థితులు మారిపోయాయని, అయినప్పటికీ సవాళ్లను ఎదుర్కొంటూ జట్టు తగిన పరిష్కారాలు కనుగొనడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇక తదుపరి క్రైస్ట్‌చర్చ్ టెస్టు గురించి మాట్లాడుతూ.. అక్కడ సాధారణంగా పిచ్‌పై కొంత గడ్డి ఉండటంతో పాటు బౌలర్లకు వేగం, బౌన్స్ లభిస్తాయని, ఈసారి కూడా అలాంటి పిచ్ ఉంటుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి టెస్టు డ్రాగా ముగియడంతో చివరి మ్యాచ్ మరింత ఆసక్తికరంగా మారిందని, క్రైస్ట్‌చర్చ్‌లో ఉత్కంఠభరిత పోరు ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ టెస్టులో న్యూజిలాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 368 పరుగులు చేయగా, భారత్ 720/9 వద్ద డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ 239/5 స్కోరు చేయడంతో మ్యాచ్ డ్రాగా ముగియగా, నికోల్స్ తొలి ఇన్నింగ్స్‌లో 175లి పరుగులతో పాటు రెండో ఇన్నింగ్స్‌లో కీలక 31 పరుగులు సాధించి జట్టు తరఫున కీలక పాత్ర పోషించారు.

హైదరాబాద్ మరో విజయం

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో హైదరాబాద్ రెండో విజయం అందుకుంది. బంతితో కెప్టెన్ సీవీ మిలింద్ (4/25), రక్షణ్ రెడ్డి (3/24), బ్యాట్‌తో కె. హిమతేజ (40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 77 సత్తా చాటడంతో ఆదివారం జరిగిన గ్రూప్-డీ మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో ఉత్తరాఖండ్‌పై విజయం సాదించింది. ఉత్తరాఖండ్ ఇచ్చిన 147 పరుగుల లక్ష్యాన్ని 15.3 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. అభిరథ్ (22) కూడా రాణించాడు. తొలుత ఉత్తరాఖండ్ 19.2 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. యువరాజ్ చౌదరి (59), అనీశ్ (43) రాణించారు. మిలింద్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. మంగళవారం జరిగే తమ తదుపరి మ్యాచ్ గుజరాత్‌తో హైదరాబాద్ తలపడనుంది.





మమితా బైజు వీడియో కలకలం

ఏఐతో ఇంత దారుణమా!

మమితా బైజు, ప్రదీప్ రంగనాథన్ పేరుతో అభ్యంతరకర వీడియో ప్రచారం

హైదరాబాద్, నవంబర్ 23 (సమయం న్యూస్): కృత్రిమ మేధ సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ దాని దుర్వినియోగం సినీ ప్రముఖులకు తీవ్ర సమస్యగా మారుతోంది. ఇప్పటికే పలువురు నటీమణులు డీప్‌ఫేక్ వీడియోలతో ఇబ్బందులు ఎదుర్కోగా, తాజాగా మలయాళ నటి మమితా బైజు, నటుడు ప్రదీప్ రంగనాథన్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న అభ్యంతరకర వీడియో వివాదానికి దారితీసింది. వీరిద్దరూ కలిసి నటించిన 'డ్యూడ్' సినిమాలోని ఓ భావోద్వేగ సన్నివేశాన్ని కృత్రిమ మేధ సాయంతో అసభ్యకరంగా మార్చి ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నటీనటుల అనుమతి లేకుండా వారి చిత్రాలను ఇలా దుర్వినియోగం చేయడంపై అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సినిమాలోని సాధారణ సన్నివేశాన్ని అసభ్యకరంగా చిత్రీకరించేలా మార్ఫింగ్ చేశారని సామాజిక మాధ్యమాల్లో పలువురు ఆరోపిస్తున్నారు. వినోదం పేరుతో వ్యక్తుల గౌరవానికి భంగం కలిగించే కృత్రిమ వీడియోలను సృష్టించడం అత్యంత అభ్యంతరకరమని విమర్శిస్తున్నారు. ఈ వీడియోను చూసిన ఓ కంటెంట్ సృష్టికర్త తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు వెల్లడించడం కూడా చర్చనీయాంశమైంది. సాంకేతికతను సృజనాత్మకతకు ఉపయోగించాల్సింది పోయి ఇతరుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు వినియోగించడం ఎంతవరకు సమంజసమని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రచారంలో ఉన్న వీడియో మూలం, దాన్ని రూపొందించిన వ్యక్తుల వివరాలు స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది. గతంలోనూ రష్మిక మందన్నా, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ వంటి పలువురు సినీ తారల పేరుతో డీప్‌ఫేక్, మార్ఫింగ్ వీడియోలు ప్రచారంలోకి వచ్చాయి. ఇప్పుడు మమితా బైజు, ప్రదీప్ రంగనాథన్ పేరుతో మరో వివాదం తెరపైకి రావడంతో సినీ పరిశ్రమలో ఆందోళన వ్యక్తమవుతోంది. కేవలం సెలబ్రిటీలే కాకుండా సామాన్య మహిళలు, యువతులు కూడా ఇలాంటి సాంకేతిక దుర్వినియోగానికి గురయ్యే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. అభ్యంతరకర వీడియోలను ఇతరులకు పంపకుండా సంబంధిత సామాజిక మాధ్యమ వేదికలకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

అర్హతలు లేకున్నా అవకాశం?

ఫ్యాకల్టీల నియామకంపై అనుమానాలు ● అమలవని యూజీసీ నిబంధనలు?



సమయం న్యూస్, కరీంనగర్ క్రైం (ఆర్మీ): కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో అధ్యాపకుల అర్హతలపై మొదలైన చర్చ ఆసక్తికరంగా మారుతోంది. శాతవాహన యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగానికి చెందిన పార్ట్‌టైమ్ అధ్యాపకుల విద్యార్హతల వివరాలలో ఒకరిద్దరి వివరాలలో నెట్, సెట్, పిహెచ్ డి ప్రస్తావన లేకపోవడం గమనార్హం. విశ్వ విద్యాలయాల్లో అధ్యాపక నియామకాలకు నిర్దిష్ట అర్హతలు, ప్రమాణాలు ఉన్న నేపథ్యంలో వారి నియామకం యూజీసీ కి చెందిన ఏ నిబంధనల ప్రకారం జరిగిందన్న అంశం పలు అనుమానాలకు తావిస్తోంది.

యూజీసీ నిబంధనలు లేని నియామకాలు..?

యూనివర్సిటీలో బోధనా బాధ్యతలు నిర్వహిస్తున్న అధ్యాపకుల నియామకాలకు సంబంధించి అర్హతలు, ఎంపిక విధానం, నియామక ఉత్తర్వులు వంటి వివరాలు పారదర్శకంగా ఉండాల్సి ఉంటుంది. అయితే కెమిస్ట్రీ విభాగానికి చెందిన పోస్టులకు అర్హత లేని వారిని నియమించారనీ, వారి నియామకం సమయంలో వర్తించిన నిబంధనలు ఏమిటనే ప్రశ్నలు విద్యార్థుల్లో ఉత్పన్నమవుతున్నాయి. నెట్, సెట్, పిహెచ్డి అవసరం లేని ప్రత్యేక నిబంధనల కింద సదరు నియామకం జరిగిందా.. అలా జరిగితే ఎంపిక కమిటీ నిర్ణయం ఏమిటనే అంశాలు తెరపైకి వస్తున్నాయి. యూజీసీ నిర్దేశించిన అర్హతలు యూనివర్సిటీల్లో అధ్యాపక నియామకాలకు కీలకమైనవి కాగా శాతవాహన యూనివర్సిటీలో సంబంధిత నియామకాలు ఏ నిబంధనల ప్రకారం చేపట్టారు? ఆ నిబంధనలకు అనుగుణంగా అభ్యర్థుల అర్హతలను పరిశీలించారా? అన్న అంశాలను యూనివర్సిటీ ఉన్నతాధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

నాణ్యమైన బోధన అందుతోందా?

ఉన్నత విద్య కోసం యూనివర్సిటీలను ఆశ్రయించే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. అధ్యాపకుల నియామకాల్లో విద్యార్హతలు, బోధనా నైపుణ్యం, సంబంధిత అంశాల్లో పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుండగా, అర్హతలపై సందేహాలు తలెత్తినప్పుడు వాటిని నివృత్తి చేయడం, నియామక ప్రక్రియపై స్పష్టత ఇవ్వడం యూనివర్సిటీ బాధ్యతగా భావించాలి. ఇదే విషయమై సంబంధిత విభాగానికి చెందిన ప్రిన్సిపల్ వివరణ కోరగా అర్హతల విషయం తాను చూడనని, యూనివర్సిటీ ఉన్నతాధికారులు పంపిన అధ్యాపకులకు సంబంధించిన తరగతుల కేటాయింపు విషయం మాత్రమే తాను చూస్తానని వెల్లడించడం గమనార్హం. శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ మాట్లాడుతూ నిబంధనల మేరకు తీసుకోవచ్చు అని చెప్పడం కొసమెరుపు. ఇప్పటికైనా యూజీసీ తో పాటు యూనివర్సిటీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అర్హత కలిగిన అధ్యాపకులను నియమించాలని, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంలో ముందుండాలని విద్యార్థులు కోరుతున్నారు.

అవకాశం ఉంది..



కెమిస్ట్రీ విభాగానికి చెందిన ఉద్యోగి కేవలం పార్ట్ టైమ్ మాత్రమే.. నోటిఫికేషన్లో నెట్, స్లెట్, జిఆర్ఎఫ్ ఉండాలని నిబంధనలు ఉన్నా, యూజీసీలో ఉన్న కొన్ని నిబంధనల ప్రకారం తీసుకోవడం జరిగింది. కేవలం చెప్పిన తరగతులకు మాత్రమే వేతనం చెల్లించడం జరుగుతుంది. నెట్, స్లెట్, జిఆర్ఎఫ్ లేకున్నా ఒక పోస్ట్ కి ఒకే వ్యక్తి రావడంతో, యూజీసీ నిబంధనల ప్రకారం తీసుకోవచ్చు.

- ఆచార్య పెద్దపల్లి సతీష్ కుమార్,
రిజిస్ట్రార్, శాతవాహన యూనివర్సిటీ

తన వాటా భూమి కోసం కలెక్టర్‌ను ఆశ్రయించిన మహిళ!

కుటుంబ భూ పంపకాల్లో అన్యాయం జరిగిందని ఆవేదన

కరీంనగర్, నవంబర్ 23 (సమయం న్యూస్) : కుటుంబ భూ పంపకాల్లో తనకు అన్యాయం జరిగిందంటూ ఓ మహిళ కరీంనగర్ జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించింది. తన భర్త వాటాకు రావాల్సిన భూమిపై తనకు హక్కు ఉందని, అయితే తనకు తెలియకుండానే సంబంధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగినట్లు ఆరోపిస్తూ ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. కుటుంబానికి చెందిన భూమి పంపకాల విషయంలో వివాదం తలెత్తింది. తన భర్త వాటాకు సంబంధించిన భూమిపై తన హక్కులను పరిగణనలోకి తీసుకోకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారని మహిళ ఆరోపించింది. ఈ వ్యవహారంతో తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసింది. సంబంధిత భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని జిల్లా కలెక్టర్‌ను కోరింది. భూమి పంపకాలు, రిజిస్ట్రేషన్ జరిగిన తీరుపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. కాగా, మహిళ చేసిన ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ, అధికారుల విచారణ అనంతరం వాస్తవాలు వెల్లడికావాల్సి ఉంది. తనకు రావాల్సిన భూమిపై హక్కులను పరిరక్షించి న్యాయం చేయాలని బాధితురాలు కోరుతోంది.



ఆయనే ప్రత్యేకతను గుర్తించారు



'భోగి' సినిమాలో మందారం పాత్రతో సరికొత్త అవతారంలో కనిపించబోతున్న డింపుల్ హయాతీ. ఇప్పటివరకు గ్లామర్ డాల్‌గా, డాన్సర్‌గా చూసిన ప్రేక్షకులు ఈసారి తనలోని కొత్త కోణాన్ని చూస్తారని ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.'ఇప్పటిదాకా నన్ను గ్లామర్ డాల్‌గా, డాన్సర్‌గా మాత్రమే తెరపై చూశారు. ఇప్పుడు నాలోని కొత్త యాంగిల్ బయటకు రాబోతుంది. మందారం పాత్రతో కొత్త డింపుల్‌ను చూస్తారు. ఈ క్రెడిట్ అంతా దర్శకుడికే దక్కుతుంది" అని డింపుల్ హయాతీ అన్నారు. శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న 'భోగి' చిత్రంలో డింపుల్ హయాతీ మందారం పాత్రలో కనిపించనున్నారు. కె.కె. రాధామోహన్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహించారు. ఈ నెల 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డింపుల్ మాట్లాడుతూ 'తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని, నలుగురిలో ప్రత్యేకంగా నిలవాలని ప్రతి ఆర్టిస్ట్ కలలు కంటుంటారు. మన దగ్గరకు వచ్చిన అవకాశాల్లో ఏది చేయగలమో, ఏది మంచిదో అదే ఎంచుకుంటాం. అలా వచ్చిన అవకాశమే 'భోగి' చిత్రంలోని మందారం పాత్ర. రాధామోహన్ నిర్మించే మరో సినిమాలోని పాత్ర కోసం ఆయన్ను కలిశాను. ఆ సందర్భంలో సంపత్ నంది కలిసి ఈ కథ చెప్పారు. వేరే సినిమా చేయాల్సిన నేను మందారం పాత్ర చేస్తానని అడిగాను. అలా నాకు ఈ అవకాశం వచ్చింది. పాత్ర గురించి వినగానే ఇది నేనే చేయాలని నిర్ణయించుకున్నాను. నా కెరీర్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చే పాత్ర ఇది. ఇప్పటిదాకా నన్ను గ్లామర్ డాల్‌గా, డాన్సర్‌గా చూశారు. ఇవన్నీ పక్కనపెట్టి తొలిసారిగా ఓ దర్శకుడు నా కళ్లపై దృష్టిపెట్టి ఈ పాత్ర ఇచ్చారు. నాలోని మరో యాంగిల్‌ను ఆయన గుర్తించారు. మందారం పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతుందో తెరపై చూస్తేనే తెలుస్తుంది. ఈ సినిమా నాకు ప్రత్యేకమైన ఫ్యాన్‌బేస్‌ను క్రియేట్ చేస్తుంది. ఈ సినిమాలో మాటలు, తెలంగాణ యాస అన్నీ అద్భుతంగా కుదిరాయి. అయితే, ఈ సినిమాలో నాకు డాన్స్ చేసే అవకాశం దొరకలేదు. శర్వానంద్, అనుపమతో కలిసి పనిచేయడం బాగుంది. కచ్చితంగా ఈ సినిమా నా కెరీర్‌లో చాలా ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ క్రెడిట్ అంతా దర్శకుడికే చెందుతుంది' అని అన్నారు.

PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

ఆలేరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి మంత్రులకు ఆహ్వానం

- **ఈ నెల 27న చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం**

ఆలేరు, నవంబర్ 23(సమయం న్యూస్):



ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర మంత్రులను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ సుదగాని మల్లేష్ గౌడ్ ఆహ్వానించారు. ఈ నెల 27వ తేదీన ఆలేరు పట్టణంలో నిర్వహించనున్న చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకావాలని కోరుతూ పలువురు మంత్రులు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కార్యక్రమానికి ఆహ్వానించారు. అలాగే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సందీప్ కుమార్‌లను కలిసి ప్రమాణ స్వీకార మహోత్సవానికి రావాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. చైర్మన్, డైరెక్టర్ల నియామకంతో రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. రైతుల సమస్యల పరిష్కారం, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం, మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, వ్యవసాయ పథకాలు అర్హులైన రైతులకు అందేలా పాలకవర్గం కృషి చేయాలని పేర్కొన్నారు.మంత్రులు ఆహ్వానంపై సానుకూలంగా స్పందించి ఈ నెల 27న ఆలేరు పట్టణంలో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతామని తెలిపినట్లు నాయకులు వెల్లడించారు. నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

కొలనుపాక ప్రభుత్వ భూమిని పేదలకు ఇంటి స్థలాలుగా కేటాయించాలి

- **ప్రజావాణిలో సీపీఐ నాయకుల వినతి.. సమస్య పరిష్కరించకుంటే ఆందోళనలు ఉద్ధృతం చేస్తాం**

ఆలేరు, నవంబరు 23(సమయం న్యూస్)



కొలనుపాక గ్రామంలోని ప్రభుత్వ భూమిని నిరుపేదలకు ఇంటి స్థలాలుగా కేటాయించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆలేరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ కొలనుపాక గ్రామంలోని సర్వే నంబరు 8లో ఉన్న 2.20 గుంటల ప్రభుత్వ భూమిని గ్రామంలోని నిరుపేదలకు ఇంటి స్థలాలుగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని గత రెండున్నరేళ్లుగా సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ తదితర అధికారులను కలిసి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అధికారులు సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పేదలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులోనూ అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందని, తమకు నచ్చిన వారికి ఇళ్లు కేటాయిస్తూ నిజమైన లబ్ధిదారులకు మొండి చేయి చూపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేసి, నిరాశ్రయులైన కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చాలని కోరారు. కొలనుపాక ప్రభుత్వ భూమిని నిరుపేదలకు కేటాయించే వరకు సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పేద ప్రజలకు అండగా సీపీఐ నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఆలేరు మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, మండల కార్యవర్గ సభ్యుడు కందుల మధు, జిల్లా ప్రజానాట్యమండలి ఉపాధ్యక్షుడు పోతు ప్రవీణ్, భూ పోరాట కమిటీ సభ్యులు మోతె భవాని, సంధ్య, సుశీల, మౌనిక, జాంగీర్ బీ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రకు బయలుదేరిన మౌలానా అబ్దుల్ కరీం అష్రఫీకి ఘనంగా సన్మానించిన మాజీ కౌన్సిలర్

కొడంగల్,నవంబర్,23(సమయం న్యూస్)



కొడంగల్ మక్కా మసీదు ఇమామ్, ఖతీబ్, ఖలీఫా షైఖుల్ ఇస్లాం మదనీ మియా అష్రఫీ సాహెబ్ మౌలానా హాఫిజ్ మహ్మద్ అబ్దుల్ కరీం అష్రఫీ ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్న సందర్భంగా సోమవారం నమాజ్ అనంతరం స్థానిక మక్కా మసీదులో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, జాకిర్ అహ్మద్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్.ఎం. గౌసన్ మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ కరీం అష్రఫీ మసీదు లో సేవలతో పాటు దైవ, సామాజిక, మతపరమైన సేవల్లో ముందుంటారని కొనియాడారు.ఆయన ఉమ్రా యాత్ర సాఫీగా సాగి, అల్లాహ్ దానిని ఆమోదించి సఫలీకృతం చేయాలని ఆకాంక్షించారు.మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మౌలానా మత పరమైన సేవలతో పాటు పేదలు, వితంతువులు, అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. కొడంగల్ పట్టణంతో పాటు తెలంగాణలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు నెలకొనేలా ప్రార్థనలు చేయాలని మౌలానాను కోరారు. జాకిర్ అహ్మద్ మౌలానాకు శాలువా, పూలమాలతో సత్కరించారు. తలారి శేఖర్, రవీంద్ర చారి కూడా మౌలానాను కలిసి ఉమ్రా యాత్రకు బయలు దేరుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

కొలనుపాక, రాజాపేట రహదారిపై సీసీ రోడ్డు పనులు ప్రారంభం

- **ప్రజల ప్రయాణ కష్టాలు తీర్చేందుకు రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం**

ఆలేరు, నవంబర్ 23(సమయం న్యూస్):



కొలనుపాక నుండి రాజాపేటకు వెళ్లే ప్రధాన మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదేశాల మేరకు చేపట్టిన ఈ పనులతో కొలనుపాకతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. రహదారి నిర్మాణంతో ప్రజల చిరకాల సమస్యకు పరిష్కారం లభించనుందని స్థానిక నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంధమల్ల అశోక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారులు ఎంతో కీలకమని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కొలనుపాక, రాజాపేట మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలేరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బండపల్లి మహేష్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్లు బండ వీర మల్లయ్య, చాడ రాజు, గ్రామ సర్పంచ్ బెదరబోయిన యాకమ్మ వెంకటేష్, ఉపసర్పంచ్ గొట్టం విజేందర్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గాదె సోమిరెడ్డి, వార్డు సభ్యులు చీరబోయిన రమేష్, మల్ల సత్తయ్య, బల్లెపు సంపత్, తేరాల శంకర్, వల్లెపు పద్మ, రాగం కవిత, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు అమృతం బాలరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సొంటెం మహేష్, ప్రధాన కార్యదర్శి కాటంరాజు, కాంగ్రెస్ నాయకులు వల్లె పరశురాములు, వానరాసి నరసింహులు, కర్రి సునీల్, జంగా దేవేందర్, నల్ల మధు, గ్రామస్థులు రాజబోయిన కొండల్, జంగ స్వామి, రాగం కర్ణాకర్, పార్వతి కృష్ణంరాజుతో పాటు పలువురు గ్రామస్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కొలనుపాక గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా రహదారి నిర్మాణ పనులు చేపట్టిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు గ్రామస్థులు, పరిసర ప్రాంత ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రహదారుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తగ్గుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

వీబీజీ రామ్ జీ కింద పశుగ్రాస సాగు పనులను చేపట్టాలి

- **అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్**

వికారాబాద్, నవంబర్,23(సమయం న్యూస్)



వీబీజీ రామ్‌జీ కింద పశుగ్రాస సాగు పనులను చేపట్టాలని అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో వీబీజీ రామ్‌జీ పనులు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలుపై అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...పశుపోషణకు ఇబ్బంది కలుగకుండా పశుగ్రాసం సాగుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఇప్పటికీ మంజూరైన గ్రామ పంచాయతీ, మహిళా సంఘాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న ఇంకుడు గుంతలు, పొలాల్లో పామ్ పాండ్, బోర్‌వెల్ రీఛార్జ్ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పనులను చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆయన తెలిపారు. పనుల అమలులో పనిచేయాలని,క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల నాణ్యతను పరిశీలించాలని అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ సుధీర్, డిఆర్డీఓ నర్సింగ్ రావు, డీపీఓ జయసుధ, పంచాయతీ రాజ్ ఈఇ ఉమేష్, డివిఎహెచ్ఓ సదానందం, నీటి పారుదల శాఖ ఇంజనీర్లు,సంబంధిత శాఖల పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటే ఖేలో ఇండియా.. ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

- **క్రీడలతో యువతలో ప్రతిభకు పదును.. జాతీయ స్థాయిలో రాణించాలి... ఎమ్మెల్యే 'కేఆర్ నాగరాజు'**

హనుమకొండ, నవంబర్ 23 (సమయం న్యూస్)

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని యువతకు పిలుపునిచ్చారు.హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 ప్రచార పోస్టర్‌ను వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌లతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, 3వ డివిజన్ అధ్యక్షుడు జన్ను అరుణాకర్, ఆరేపల్లి పాక్స్ మాజీ చైర్మన్ బుద్దే పెద్దన్న, మాజీ కార్పొరేటర్ జన్ను శిభారాణి అనిల్, సీనియర్ నాయకుడు విసం సురేందర్ రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు



ప్రతి కుటుంబానికి ఒక భరోసా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం..

రాయపోల్ నవంబర్ 23. (సమయం న్యూస్)

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని మంతూర్ గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పర్వేజ్ అహ్మద్. కాంగ్రెస్ పార్టీ రాయపోల్ మండల ఉపాధ్యక్షులు పాల రామా గౌడ్. తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూగ్రామంలో ప్రతి కుటుంబానికి ఈ పథకం ద్వారా ఒక భరోసా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఇందిరమ్మ బీమా పథకం పేద ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డ్ కలిగి ఉన్న ప్రతి ఒక్కరు ఈ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ బీమా పథకం ఎంతో వరం లాంటిదని. నిరుపేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు. గతంలో ఇప్పుడు లేనివిధంగా అన్ని వర్గాల ప్రజలకు కుటుంబంలో ఆపదలో ఉన్న వారికి ఇందిరమ్మ బీమా పథకం ఎంతో ఉపయోగపడే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో సీఎం సిద్దిపేటలో లాంచనంగా ప్రారంభించాలని. ఈ పథకాన్ని అన్ని గ్రామాల్లో ప్రజలు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. తదితరులు ఈ కార్యక్రమంలో నాయకులు. అధికారులు పాల్గొన్నారు.



మహిళా సంఘాల బలోపేతానికి పెద్దపీట

- **మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం.. వీవో భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే 'కేఆర్ నాగరాజు'**

వర్ధన్నపేట, నవంబర్ 23 (సమయం న్యూస్)

మహిళా సంఘాల బలోపేతం, మహిళల ఆర్థిక స్వావలంబనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. వర్ధన్నపేట మండలం బండౌతపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సంఘం (వీవో) భవనాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల కార్యకలాపాల నిర్వహణకు నూతన భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళా సాధికారత, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట పాక్స్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, గ్రామ సర్పంచ్ బత్తిని దశరథం, గ్రామశాఖ అధ్యక్షుడు సినెపల్లి బాబు, మాజీ సర్పంచ్ అరుణ సాయి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



ఈటల రాజేందర్ నివాసానికి కేంద్ర మంత్రి ఎస్.పీ. సింగ్ బఘేల్

- **పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులతో భేటీ.. సమస్యల పరిష్కారానికి సానుకూల హామీ**

హైదరాబాద్, నవంబర్ 23

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్.పీ. సింగ్ బఘేల్ సోమవారం ఎంపీ ఈటల రాజేందర్ నివాసాన్ని మర్యాదపూర్వకంగా సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రి పౌల్ట్రీ ఫామ్‌ను సందర్శించి, పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమయ్యారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, వివిధ డిమాండ్లను ప్రతినిధులు మంత్రికి వివరించి వినతిపత్రాలు సమర్పించారు. వినతులను పరిశీలించిన కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, పరిశ్రమ ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అనుకూలంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ ప్రాజెక్టులకు RERA అనుమతులు

- **ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ ప్రాజెక్టులకు RERA అనుమతులు**

హైదరాబాద్, నవంబర్ 23:

అల్పాదాయ వర్గాల ప్రజల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో తెలంగాణ హౌసింగ్ బోర్డు చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ గృహ నిర్మాణ ప్రాజెక్టులకు RERA అనుమతులు లభించాయి.RERA ఛైర్మన్ శ్రీ శ్రీనివాసరాజు నుంచి అనుమతి పత్రాలను హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ విపి గౌతం స్వీకరించారు.ప్రభుత్వ ఆధ్వర్యంలోని గృహ నిర్మాణ ప్రాజెక్టులకు RERA అనుమతులు లభించడం ఇదే తొలిసారి కావడం విశేషం.హైదరాబాద్ మహానగర పరిధిలో ఈ పథకం ద్వారా లక్ష ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో పైలట్ ప్రాజెక్టుగా 20 నియోజకవర్గాల్లో సుమారు 12,000 ఇళ్ల నిర్మాణం చేపడుతోంది. లబ్ధిదారులకు భూమిని ఉచితంగా అందించడంతో పాటు, అవిభక్త భూమి వాటా (UDS)ను కూడా రిజిస్టర్ చేసి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.ప్రాజెక్టులకు RERA అనుమతులు లభించడం వల్ల పారదర్శకత, నిబంధనల అమలు, లబ్ధిదారుల హక్కుల పరిరక్షణకు మరింత భరోసా కలుగుతుందని అధికారులు తెలిపారు. అలాగే RERA అనుమతులు ఉన్న ప్రాజెక్టులకు బ్యాంకు రుణాల మంజూరు ప్రక్రియ కూడా సులభతరం కానుంది.తొలి దశలో మలక్‌పేట, ఎత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లోని ప్రాజెక్టులకు RERA అనుమతులు మంజూరయ్యాయి. బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.30-50 లక్షల విలువ చేసే ఫ్లాట్లను పేద ప్రజలకు కేవలం రూ.6 లక్షలకే అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టింది.ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌కు RERA అనుమతులు రావడం హౌసింగ్ బోర్డు చరిత్రలో కీలక మైలురాయిగా వైస్ ఛైర్మన్ విపి గౌతం పేర్కొన్నారు. RERA అనుమతులతో ప్రజల్లో ప్రాజెక్టులపై విశ్వాసం మరింత పెరుగుతుందని, పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ హౌసింగ్ బోర్డు ముందుకు సాగుతుందని తెలిపారు.

తెలంగాణ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

- **నైపుణ్య భాగస్వామ్యంపై మంత్రి వివేక్ కీలక చర్చలు**

న్యూఢిల్లీ, నవంబర్ 23

తెలంగాణ యువతకు జర్మనీలో అంతర్జాతీయ ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కీలక చర్చలు జరిపారు. న్యూఢిల్లీలో జర్మనీలోని లోయర్ సాక్సనీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒలాఫ్ లీస్, జర్మనీ రాయబారి డాక్టర్ జాస్పర్ వీక్ తదితరులతో జరిగిన టాలెంట్ మొబిలిటీ రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 300 ఐటీఐలు, టాటా టెక్నాలజీస్ సహకారంతో 65 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని, మరో 54 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను మరింత బలోపేతం చేసేందుకు TOMCOMలో లోయర్ సాక్సనీ కార్యాలయం ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి తెలిపారు. యువత నైపుణ్యాభివృద్ధి, విదేశీ ఉపాధి అవకాశాల కోసం సీఎం ఓవర్సీస్ పథకం కింద రూ.50 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.



పేదల పొట్టకొట్టి.. పెద్దల ఆక్రమణలపై మౌనమెందుకు.?

- **పేదల బతుకులపైనే బుల్డోజరా.? పెద్దల ఆక్రమణలపై మౌనమెందుకు.?**
- **జీవనోపాధిని లాక్కొని.. పేదలను రోడ్డున పడేయొద్దు**
- **ఫుట్‌పాత్ తొలగింపుల్లో వివక్ష ఎందుకు? చిరు వ్యాపారులకే కఠిన నిబంధనలా**
- **చిరు వ్యాపారులపై మున్సిపల్ అధికారుల జులుం**

నర్సంపేట, నవంబర్ 23 (సమయం న్యూస్)

రెక్కాడితే గానీ డొక్కాడని చిరు వ్యాపారుల జీవనోపాధిపై మున్సిపల్ అధికారుల చర్యలు తీవ్ర ఆందోళనకు దారితీస్తున్నాయి. పట్టణంలో రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల పై చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న పేదలపై అధికారులు కొరడా ఝళిపిస్తుండగా, ఆక్రమణల విషయంలో అందరికీ ఒకే నిబంధన అమలవుతోందా? అన్న ప్రశ్నలు పట్టణ ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. జీవనోపాధి కోసం ఫుట్‌పాత్‌పై పండ్ల విక్రయిస్తున్న చిరు వ్యాపారుల పండ్లను చెత్తబండిలో వేసి తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆ పండ్లే వారి కుటుంబాలకు ఆధారం కాగా, వాటిని తొలగించడం ద్వారా వారి బతుకుదెరువుపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించడం అవసరమే అయినప్పటికీ, పేదల జీవనోపాధిని దెబ్బతీయకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉందని పేర్కొంటున్నారు.మరోవైపు మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట కొన్నేళ్లుగా కొనసాగుతున్న శారదా బుక్ స్టోర్, పల్లవి బుక్స్ విషయంలోనూ ఫుట్‌పాత్ ఆక్రమణలపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఆక్రమణలు ఎవరు చేసినా ఒకే విధంగా వ్యవహరించాల్సిన అధికారులు, పేదల విషయంలోనే కఠినంగా ఉంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఫుట్‌పాత్‌లు పాదచారుల కోసం ఉండాలి.. పట్టణంలో ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకూడదు. అదే సమయంలో పేదల జీవనాధారమైన చిన్న వ్యాపారాలు కూడా రోడ్డున పడకూడదు. ఆక్రమణల తొలగింపులో పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ సమాన నిబంధనలు అమలు చేయాలని, బాధిత చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపిస్తూ మున్సిపల్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



శిక్షణలో ప్రతి అంశాన్ని ఆసక్తిగా నేర్చుకొని పోలీస్ విధులపై పూర్తి అవగాహన పెంచుకోవాలి

- **ట్రైనీ డీఎస్పీలకు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS సూచన**

నారాయణపేట,నవంబర్,23(సమయం న్యూస్)

పోలీస్ శాఖలో శిక్షణ అనేది భవిష్యత్తులో సమర్థవంతమైన పోలీస్ అధికారులుగా ఎదగడానికి ఎంతో కీలకమని, శిక్షణలో భాగంగా ప్రతి అంశాన్ని ఆసక్తిగా నేర్చుకొని పోలీస్ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ట్రైనీ డీఎస్పీలకు సూచించారు.పోలీస్ శాఖ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రాక్టికల్ ట్రైనింగ్ కోసం నారాయణపేట జిల్లాకు కేటాయించబడిన ముగ్గురు ట్రైనీ డీఎస్పీలు 1) దైనంపల్లి ప్రవీణ్ , 2) బానోతు శ్రీనికేష్ నాయక్, 3) పూజారి అనురాగ్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ను మర్యాదపూర్వకంగా కలిసి 6 నెలల శిక్షణ నిమిత్తం రిపోర్ట్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారికి జిల్లాలోని వివిధ పోలీస్ విభాగాలు,వాటి విధులు, బాధ్యతలు, పోలీస్ శాఖ పనితీరు గురించి వివరించారు. శిక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్ల నిర్వహణ,కేసుల నమోదు,దర్యాప్తు విధానం,నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం వంటి అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి నేర్చుకోవాలని సూచించారు.ప్రతి పోలీస్ అధికారి విధి నిర్వహణలో చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటంతో పాటు, పరిస్థితులకు అనుగుణంగా సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని



తెలిపారు. శిక్షణ సమయంలో సీనియర్ పోలీస్ అధికారుల అనుభవాలను తెలుసుకుంటూ, వారు సూచించే ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి ఆచరణలో నేర్చుకోవాలని అన్నారు.ప్రజలతో మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలని, బాధితుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతూ ప్రజలకు న్యాయం అందించాలని సూచించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం, విశ్వాసం పెంపొందించే విధంగా విధులు నిర్వహిస్తూ, క్రమశిక్షణ, నిబద్ధత, సేవాభావంతో సమర్థవంతమైన పోలీస్ అధికారులుగా ఎదగాలని ట్రైనీ డీఎస్పీలకు జిల్లా ఎస్పీ సూచించారు.

బాధితులకు న్యాయం.. ప్రజలకు భరోసా కల్పించాలి

- **వృత్తి నైపుణ్యాలు.. ప్రజా సేవా దృక్పథం పెంపొందించుకోవాలి... సీపీ 'ఎన్.శ్వేత'**
- **పోలీస్ విధులపై ప్రొబేషనరీ డీఎస్పీలకు దిశానిర్దేశం**

వరంగల్, నవంబర్ 23 (సమయం న్యూస్) :

పోలీస్ విధుల పట్ల సమగ్ర అవగాహన పెంపొందించుకుని, క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీతో ప్రజలకు సేవలందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్, ప్రొబేషనరీ డీఎస్పీలకు సూచించారు.ఇటీవల డీఎస్పీల నియామకాల్లో ఎంపికైన ఐదుగురు ప్రొబేషనరీ డీఎస్పీలు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 24 వారాల పాటు నిర్వహించనున్న ప్రాక్టికల్ శిక్షణలో భాగంగా సోమవారం సీపీ ఎన్. శ్వేతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడిన సీపీ, శిక్షణ కాలాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ పోలీస్ శాఖ పనితీరుపై క్షేత్రస్థాయి అవగాహన పెంపొందించుకోవాలన్నారు.పోలీస్ స్టేషన్ల నిర్వహణ, నేరాల దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీస్ పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాలను క్షేత్రస్థాయిలో నేర్చుకోవాలని దిశానిర్దేశం చేశారు. విధి నిర్వహణలో



క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ చట్ట పరిధిలో పనిచేయాలని, బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలను ఓపికగా వినాలని, సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం, భరోసా పెంపొందించేలా ప్రతి అధికారి తన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను భవిష్యత్తులో ఆచరణలో పెట్టాలని సీపీ తెలిపారు. సీపీని కలిసిన ప్రొబేషనరీ డీఎస్పీలలో ధారావత్ సభిత, పల్లేటి సాయి ప్రత్యూష్ రెడ్డి, బుషిరెడ్డి శంతన్ కుమార్ రెడ్డి, రావిరాల యశశ్వినీ, జేరిపోతుల ఆంజనేయులు ఉన్నారు.

ఆత్మరక్షణకు టైక్వాండో ఎంతో అవసరం

- **విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి**
- **సీఐ చంద్రశేఖర్‌రెడ్డి**
- **నవీన ఆదర్శ కాన్వెంట్ హైస్కూల్‌లో టైక్వాండో జిల్లా స్థాయి సెలక్షన్స్**
- **సీఐ చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా బెస్ట్ మాస్టర్ నంది అవార్డు అందుకున్న హెచ్ మనోహర్**

కొడంగల్ మున్సిపల్, నవంబర్,23(సమయం న్యూస్)

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, శారీరక దృఢత్వం, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని కొడంగల్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ముఖ్యంగా బాలికలు, మహిళలు ఆత్మరక్షణ విద్యలో నైపుణ్యం సాధించడం నేటి సమాజంలో ఎంతో అవసరమని పేర్కొన్నారు. సోమవారం నవీన ఆదర్శ కాన్వెంట్ హైస్కూల్‌లో టైక్వాండో జిల్లా అధ్యక్షులు గంటి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో టైక్వాండో జిల్లా స్థాయి సెలక్షన్స్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొడంగల్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ,చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. క్రీడలు శరీరాన్ని దృఢంగా ఉంచడంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని అన్నారు. ముఖ్యంగా టైక్వాండో వంటి ఆత్మరక్షణ విద్యలు బాలికలకు ఎంతో ఉపయోగకరమని, ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునే ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా టైక్వాండో అధ్యక్షులు గంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి



ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతోపాటు జిల్లా, రాష్ట్ర స్థాయిలో జాతీయస్థాయిలో రాణించే క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టైక్వాండో సాధన కేవలం క్రీడ మాత్రమే కాదని, క్రమశిక్షణ,పట్టుదల, ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ సామర్థ్యాలను పెంపొందించే విద్య అని అన్నారు. ప్రతి విద్యార్థి కి కొడంగల్ పోలీస్ స్టేషన్ వెనకాల గల జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్ లో మంగళవారం, గురువారం, ఆదివారం , సాయంత్రం 5:30 నుంచి 6:30 వరకు టైక్వాండో కరాటే శిక్షణ క్లాసులు ప్రారంభించబడ్డాయి కావున క్రీడల్లో భాగస్వామి కావాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టైక్వాండో జిల్లా కార్యదర్శి హకీం మనోహర్, పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్ రాజు, కరస్పాండెంట్ వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదింటికి ఆర్థిక ధైర్యం.. రూ.5 లక్షల జీవిత బీమా

- **ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో పేదలకు ఆర్థిక భరోసా**
- **అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం... ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

వరంగల్, నవంబర్ 23 (సమయం న్యూస్) :

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించి, ఆపద సమయంలో అండగా నిలవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోయిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల బీమా భరోసా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.సోమవారం ఉప్పరపల్లి క్రాస్ కళ్యాణి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, పేద కుటుంబాల ఆర్థిక



భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వర్ధన్నపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ శిబారాణి రాజేందర్, వర్ధన్నపేట పాక్స్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, కల్లెడ పాక్స్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, చౌటపల్లి పాక్స్ చైర్మన్ అత్తి కుమారస్వామి, పర్వతగిరి మండల అధ్యక్షురాలు సావిత్రి, వర్ధన్నపేట పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

శబరిమల యాత్రకు TGSRTC సూపర్ లగ్జరీ బస్సు బుకింగ్

- **పందళరాజ ఆశ్రమం ఆధ్వర్యంలో**
- **డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్**

తాండూర్ మున్సిపల్, నవంబర్,23(సమయం న్యూస్)

అయ్యప్ప స్వాముల పవిత్ర శబరిమల యాత్రకు సంబంధించి తాండూర్ పట్టణంలోని పందళరాజ ఆశ్రమం గురుస్వామి హనుమయ్య గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) తాండూర్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సును బుక్ చేయడం జరిగింది .ఈ సందర్భంగా శబరిమల యాత్ర కోసం ఆరు రోజుల పాటు 3400 కిలోమీటర్లుకు సూపర్ లగ్జరీ బస్సును బుక్ చేసుకోగా, మొత్తం ప్రయాణ చార్జీ రూ. 2,24,589/ కాగా, అందులో భాగంగా రూ. 50,000/ అడ్వాన్స్‌గా చెల్లించడం జరిగింది.ఈ సందర్భంగా తాండూర్ డిపో మేనేజర్ శ్రీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, అయ్యప్ప స్వాముల సౌకర్యార్థం TGSRTC ప్రత్యేక బస్సు సదుపాయాలను అందిస్తోందని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం



చేసుకొని సురక్షితంగా, సౌకర్యవంతంగా తమ పవిత్ర శబరిమల యాత్రను పూర్తి చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాండూర్ డిపో సిబ్బంది నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.